క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

చివ్వెంల : వల్లభాపురం గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ డీసీసీ కార్యదర్శి మోగదాల లక్ష్మయ్య వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు మెడబోయిన నాగరాజు, చింతల నర్సయ్య, గుడిసె రామక్రిష్ణ, మామిడి యల్లయ్య, పల్లెటి జనార్దన్, వీరబ్రహ్మాచారి, గుడిసె భిక్షం, చింతల సైదులు, నరసింహారావు, దాసరి లింగయ్య, పుల్లయ్య, సైదులు, సుందరయ్య, వెంకటేష్, పవన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలగిరి : ఖమ్మం జిల్లా కేంద్రంలో మార్చి 3, 4, 5 తేదీల్లో జరిగే మహా సభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా తుంగతుర్తి డివిజన్ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ కోరారు. ఆదివారం మహాసభ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. భారత దేశంలో ఫాసిస్టు ప్రభావం పెరుగుతుందని, విప్లవకారులంతా ఐక్యంగా పోరాడాలని కోరారు. ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు ప్రజాస్వామికవాదులంతా పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కె.వెంకన్న, కొత్తపల్లి రేణుక, పి.నాగయ్య, గొడ్డలి నర్సయ్య, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపు అడ్డగింత

చివ్వెంల : మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో అక్రమంగా చెరువు మట్టి తరలించడాన్ని గ్రామస్తులు, అధికారులు ఆదివారం అడ్డుకున్నారు. గ్రామస్తులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తన వ్యవసాయ భూమిలో గ్రామ శివారులోని పెద్ద చెరువు నుంచి మట్టిని తరలించి డంపు చేశాడు. అయితే ఇటీవల ఎస్సారెస్పీ నీటితో చెరువు నిండి ఉండడంతో మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటుక బట్టీల వ్యాపారులు అతడి వద్ద డంపు మట్టిని కొనుగోలు చేసి జేసీబీ, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇది గమనించిన గ్రామస్తులు రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు సంఘటనా స్థలానికి చేరుకునే సరికి మట్టిని తరలిస్తున్న అక్రమార్కులు అక్కడ నుంచి ట్రాక్టర్లు, జేసీబీలతో పరారయ్యారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన మైనింగ్ అధికారి రాజు మాట్లాడుతూ మట్టిని సీజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

తిమ్మాపురం జీపీ మాజీ పాలకవర్గానికి సన్మానం

అర్వపల్లి : తిమ్మాపురం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ పాలెల్లి సురేష్‌తో పాటు పాలకవర్గాన్ని ఆదివారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ప్రజల కోసం పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ కుందుర్తి వెంకట్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు వేములకొండ ఉప్పలయ్య, రత్నం లక్ష్మాజీ, రత్నం సంతోష్, బీరవోలు వాసుదేవరెడ్డి, కొణతం కరుణాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లింగరాజు, ఈదునూరి సంతోష్, రత్నం మల్లేషం, శేఖర్‌రెడ్డి, రజాక్, సైదులు, మహేష్, బాలరాజు, వెంకన్న, రమేష్, వెంకటనర్సు, నాగరాజు, లింగంగౌడ్, శ్రీకాంత్, కాటమయ్య, నాగమ్మ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నాగారం సీఐగా రఘువీర్‌రెడ్డి

నాగారం : నాగారం సీఐగా రఘువీర్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. నాగారం సీఐగా పనిచేస్తున్న కె.శివశంకర్ శనివారం హైదరాబాద్‌లోని ఐజీపీ మల్టీజోన్-2 కార్యాలయానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఐజీపీ మల్టీజోన్-2 నుంచి రఘువీర్‌రెడ్డి నాగారం సీఐ గా వచ్చారు. సీఐ రఘువీర్‌రెడ్డిని సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు.

దళిత బంధుపై ఫిర్యాదుల వెల్లువ

- ఇప్పటివరకు 65 ఫిర్యాదులు
- తహసీల్దార్ కార్యాలయంలోని బాక్స్‌లో వేసిన బాధితులు

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని వివిధ మండలాల్లో దళిత బంధు పథకంలో నష్టపోయిన లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. దళితుల ఆర్థిక అభ్యున్నతి కోసం ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దళిత బంధు పథకం తీసుకొచ్చింది. ఈ పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా 4 ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాల్లో మొదటగా పైలట్ ప్రాజెక్టుగా అమలు చేశారు. అందులో భాగంగా సూర్యాపేట జిల్లాలోని తిరుమలగిరి మండలం కూడా పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైంది. ఈ మేరకు ప్రభుత్వం మండలంలో 2,223 కుటుంబాలను గుర్తించి వారందరికీ ఒక్కో యూనిట్‌కు రూ.10 లక్షల చొప్పున రూ.230 కోట్లను మంజూరు చేసింది.

అంతా మోసం..

మొదటగా గ్రామాల్లో అధికారులు లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి ఇష్టమైన యూనిట్లను ఎంపిక చేసుకోవాలని కోరారు. లబ్ధిదారులు యూనిట్లను ఎంపిక చేసుకోగా.. తీరా పంపిణీ సమయంలో అవకతవకలు చోటు చేసుకున్నాయి. చాలామంది లబ్ధిదారులకు రూ.3 నుంచి రూ.6 లక్షల వరకే ఇచ్చారు. మిగతా డబ్బులు, యూనిట్ల కోసం లబ్ధిదారులు అడిగితే ఇంతే వస్తాయని చెప్పి దబాయించారు. అంతేకాకుండా లబ్ధిదారులు తాము దరఖాస్తులను ఒక యూనిట్‌కు చేసుకుంటే మరో యూనిట్‌ను అందించిన సంఘటనలు కూడా ఉన్నాయి. మొత్తం వ్యవహారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు కుమ్మక్కై మోసాలకు పాల్పడినట్లు లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

జీఎస్టీ పేరుతో దగా..

వ్యాపారులు లబ్ధిదారులకు నామ మాత్రంగా సరుకులు, ఇతర వస్తువులు ఇచ్చి జీఎస్టీ పేరు మీద రూ.1.80 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు చేశారు. మరికొంత మంది వ్యాపారులు నాసి రకం బ్రాండ్ల వాహనాలు, పనిముట్లు ఇచ్చారు. కిరాణం, క్లాత్ స్టోర్, ఫుట్‌వేర్, స్టీల్ సామగ్రి, హార్డ్‌వేర్, సిమెంటు, ఐరన్ దుకాణాల ఏజెన్సీల వారు రూ.6 లక్షల నుంచి రూ.7.50 లక్షల వరకు మాత్రమే ఇచ్చారు. మిగతా సొమ్ము జీఎస్టీ కింద కట్ అయిందని తెలిపారు. అంతేకాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులకు, పీఏలకు ఇచ్చామని చెప్పారు. గేదెలు, గొర్రెలు యూనిట్లలోనూ అవినీతి చోటు చేసుకుంది. లబ్ధిదారులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు తీసుకెళ్లి గేదెలు, గొర్రెల ముందు



తిరుమలగిరిలో ఎమ్మెల్యే మందుల సామేల్‌కు వినతి పత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసి యూనిట్ ముట్టినట్లు చూపించారు. ఒక్కొక్కరికి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు కూడా రాలేదు. కొద్ది మంది లబ్ధిదారులు గొర్రెలను వాహనాల్లో తీసుకొస్తుంటే సగం వరకు చనిపోయాయి. చనిపోయిన వాటికి ఇన్సూరెన్సు చెల్లిస్తామని చెప్పి ఏ ఒక్కరికి కూడా ఇన్సూరెన్సు డబ్బులు ఇవ్వలేదు. అలాగే ట్రాక్టర్లు, మినీ ట్రక్కులు, బస్సులు, కార్ల ఏజెన్సీల యజమానులతో ప్రజా ప్రతినిధులు, అధికారులు కుమ్మక్కై వీటి ధరలు పెంచి (ఇన్‌వాయిస్) బిల్లులు ఇచ్చారు. ఒక్కో వాహనంలో రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి.

భారీ దోపిడీ..

తిరుమలగిరి దళితబంధు పైలట్ ప్రాజెక్టులో ఒక్కో యూనిట్‌లో రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు అవినీతి జరిగిందని బాధితులు వాపోతున్నారు. ప్రతి ఒక్కరూ పర్సంటేజీల ప్రకారం వాటాలు తీసుకున్నారని ఆరోపిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయం, మున్సిపాలిటీ కార్యాలయంలో పనిచేసే కింది స్థాయి నుంచి పైస్థాయి అధికారులు, జిల్లా కార్యాలయంలో కూడా ప్రతి యూనిట్ పేరు మీద లంచాలు చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతోపాటు ప్రజా ప్రతినిధులు తమ వాటాను తాము తీసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు చేతులు మారినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.

ఆందోళన బాటలో..

దళిత బంధు లబ్ధిదారులు తమకు రావాల్సిన డబ్బులు, గేదెలు, వస్తువులు పూర్తిగా రాకపోవడంతో ఆందోళన బాట పట్టారు. కలెక్టర్‌కు, ఎంపీడీఓ, పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదులు చేశారు. ఎంపీడీఓ ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. విచారణ జరిపి బాధితులను కఠినంగా శిక్షించాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు..

దళిత బంధు పథకంలో నష్టపోయిన లబ్ధిదారులు నూతన ప్రభుత్వం ఏర్పడగానే తహసీల్దార్, ఎంపీడీఓ, కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే మందుల సామేల్‌కు వినతి పత్రాలను పెద్దసంఖ్యలో ఇవ్వడం ప్రారంభించారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సామేల్ దళిత బంధులో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో దళిత బంధు ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేశారు. దీంతో దళిత బంధు బాధితులు తమ ఫిర్యాదులను ఆ బాక్సులో వేస్తున్నారు. ఇప్పటివరకు బాక్సులో 65 మంది లబ్ధిదారులు ఫిర్యాదులు, వినతిపత్రాలు వేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపించాలని, దోపిడీదారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ జిల్లా అధికారులను కోరారు.

అవినీతిపై విచారణ జరిపిస్తా



"తిరుమలగిరి మండలంలో దళిత బంధు పైలట్ ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై బాధితులు చాలా మంది ఫిర్యాదు చేశారు. ఇందులో జరిగిన అవినీతిపై విచారణ జరిపించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తా. అక్రమార్కులను వదిలిపెట్టే ప్రసక్తి లేదు. దళితుల సొమ్ము తిన్న వాళ్లంతా కక్కాల్సిందే.

– మందుల సామేల్, తుంగతుర్తి ఎమ్మెల్యే

చెప్పల దుకాణం అడిగితే..



"దళిత బంధు యూనిట్‌లో చెప్పుల దుకాణం కోసం దరఖాస్తు చేసుకున్నాను. నా యూనిట్‌ను నాకు తెలియకుండానే విఘ్నేశ్వర కిరాణం వారికి మార్చారు. నాకు రూ.6.40 లక్షల చెక్కు మాత్రమే ఇచ్చారు. మిగతా డబ్బులు అడిగితే జీఎస్టీ కింద పోయినవని, నీ దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరిస్తున్నారు.

– కందుకూరి కుమారస్వామి, తిరుమలగిరి

రెండు గేదెలే ఇచ్చారు



"నేను గేదెల యూనిట్‌కు దరఖాస్తు చేసుకున్నాను. మొదటగా రూ.1.50 లక్షలతో షెడ్డు వేశారు. షెడ్డు మొత్తం నాసిరకంగా ఉంది. మొత్తం గేదెలు ఇవ్వకుండా రెండు గేదెలు మాత్రమే ఇచ్చారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మా గేదెలు మాకు ఇప్పించండి.

– జలగం ముత్తయ్య, అనంతారం

ఘంటసాల పాటలు అజరామరం



స్వరాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

భానుపురి : సృష్టి ఉన్నంతకాలం ఘంటసాల పాటలు అజరామరంగా నిలుస్తాయని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకట్ నారాయణ, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ నాగభూషణం, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి సోమనరసయ్య అన్నారు. అమర గాయకుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలాజీ బకెట్ హాల్లో స్వరాభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. సంగీతసాగరాన్ని మథించి, అమృత తుల్యమైన పాటలభాండాగారాన్ని అందించిన మధురగాయకుడు ఘంటసాల అని కొనియాడారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని, జైలుశిక్ష అనుభవించి, స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించే పాటలు పాడిన వ్యక్తి ఘంటసాల అని అన్నారు. సందర్భంగా పలువురు గంటసాల పాడిన పాటలను శ్రోతలకు వినిపించారు. పాటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. శ్రీ జ్ఞాన సరస్వతి కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ రాజశేఖర్, కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నాయకులు యామా ప్రభాకర్, బాలభవన్ సూపరింటెండెంట్ రాధాకృష్ణారెడ్డి, కళావేదిక అధ్యక్షుడు బుర్రి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గుండా రమేష్, ఉపాధ్యక్షుడు నక్క శ్రీనివాస్, సత్యం, జిల్లా రైస్ మిల్లర్స్ నాయకులు కక్కిరేని చంద్రశేఖర్, ఈటీవీ పాడుతా తీయగా విశ్లేషకులు రాజబాబు కళావేదిక కార్యనిర్వాహక సహాయకులు గోపారపు రాజు, బచ్చు పురుషోత్తం, సత్యం, కేవీఎస్ కుమార్, కల్లూరు నాగయ్య పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి, కిషోర్

తిరుమలగిరి : ఈ నెల 13వ తేదీన నల్లగొండలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆర్మూర్ మాజీ శాసన సభ్యుడు జీవన్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ శాసన సంభ్యుడు గాదరి కిషోర్‌కుమార్ కోరారు. ఆదివారం తిరుమలగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కేఆర్ఎంబీని కేంద్ర ప్రభుత్వానికి అప్పగించడం దురదృష్టకరమని ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఇరిగేషన్ శాఖ మంత్రులకు ప్రాజెక్టులపై కనీస అవగాహన లేదని అన్నారు. నల్లగొండ గడ్డ కేసీఆర్ అడ్డా అని, కోమటిరెడ్డి బ్రదర్స్ ఒక జోకర్స్ అని విమర్శించారు. జనవరి 16వ తేదీన కేఆర్ఎంబీపై రాష్ట్ర ప్రభుత్వం సంతకాలు చేసిందని, అబద్ధపు హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఆరు గ్యారంటీలు ఎక్కడా అమలు కావడం లేదని తెలిపారు. రైతు బంధు, దళిత బంధుపై చేతులెత్తేశారని విమర్శించారు. గత 9 సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి తీసుకెళ్లిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని తెలిపారు. ఈ నెల 13న నల్లగొండలో జరిగే బహిరంగ సభకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, ఎస్‌కే.రజాక్, తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజని, ఎంపీపీ నెమురు గొమ్ముల స్నేహలత, కల్లెట్లపల్లి ఉప్పలయ్య, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, శోభన్‌బాబు, నరేష్, త్రిశూల్, యాదగిరి, చిరంజీవి, అడ్డబొట్టు చారి తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : కృష్ణానది ప్రాజెక్టుల నుంచి రావాల్సిన వాటా కోసం ఈ నెల 13న నల్లగొండలో జరిగే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ కోరారు. సభ విజయవంతానికై ఆదివారం జాజిరెడ్డిగూడెంలో పార్టీ శ్రేణులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. అలాగే తిమ్మాపురంలో వైస్ ఎంపీపీ మారిపెద్ది భవానిశ్రీనివాస్‌గౌడ్ సభ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోటమర్తి మల్లయ్య, కుంభం నాగరాజు, పెద్ది శ్రీనివాస్, యోగానందం, నర్సింగం వెంకన్న, సోమయ్య, రాజు, మహేష్, నాగరాజు, నరేష్, సైదులు, కందుల దశరథరామారావు, పీఏసీఎస్ చైర్మన్ మారిపెద్ది మంగమ్మ, పాల సొసైటీ చైర్మన్ చల్లా వేణుధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బొడ్డు వెంకన్న, దేశిడి సందీప్‌రెడ్డి, బూర్గుల రాంబాబు, జీడి నర్సయ్య, వెంకటేష్, వెంకటనారాయణ, రాజు, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

యానాల చంద్రారెడ్డికి ఘన నివాళి



డి.కొత్తపల్లిలో జెండాను ఆవిష్కరించి, నివాళులర్పిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

నాగారం : కామ్రేడ్ యానాల చంద్రారెడ్డి ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ అన్నారు. యానాల చంద్రారెడ్డి 41వ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఆదివారం డి.కొత్తపల్లి గ్రామ స్టేజీ వద్ద జెండాను ఆవిష్కరించి, చంద్రారెడ్డి స్మారక స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కామ్రేడ్ యానాల చంద్రారెడ్డి ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరుబాట పట్టి తుంగతుర్తి ప్రాంతంలో విప్లవ ఉద్యమాలు చేశారని అన్నారు. భూమికోసం, భుక్తికోసం, పేద ప్రజల విముక్తి కోసం, భూస్వామ్య వ్యవస్థ రద్దు కోసం పోరాటాలను నిర్వహించిన గొప్ప మహనీయుడు చంద్రారెడ్డి అని కొనియాడారు. ఆయన ఆశయ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి సంపెట కాశయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, కడారి సైదులు, యానాల సుధాకర్‌రెడ్డి, భయ్య లింగయ్య, హేమలత, ఎస్‌డీ బాడేమీయా, నాతి ఉప్పలయ్య, కసం వీరయ్య, కడారి సైదులు, పెరమాళ్ల సత్తయ్య, కళింగారెడ్డి, కొమరయ్య, లింగయ్య, లింగస్వామి, మల్లేష్, బద్రి, శ్రీను, సోమన్న, రమేష్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ధనియాకుల గురువయ్య



దురాజ్‌పల్లి : గురువయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



పెన్‌పహాడ్ : గురువయ్య స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

దురాజ్‌పల్లి : ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు ధనియాకుల గురువయ్య అని, ఆయన స్ఫూర్తితో ప్రజా పోరాటాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన గురువయ్య 25వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. గురువయ్య 1999 ఫిబ్రవరి 11న హత్య చేయబడ్డారని, నిత్యం ప్రజల గురించి ఆలోచించే మహానుభావుడు ఆయన అని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు వెలుగురు గోవింద్, వేల్పుల వెంకన్న, జ్యోతి, మేకనబోయిన శేఖర్, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : నిత్యం ప్రజల కోసం పరితపించిన మనిషి ధనియాకుల గురువయ్య అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. గురువయ్య 25వ వర్ధంతి సందర్భంగా ఆదివారం నాగులపాటి అన్నారం గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రణపంగ కృష్ణ, ధనియాకుల శ్రీనివాస్, అయితబోయిన సత్యనారాయణగౌడ్, ముదిగొండ వీరస్వామి, శౌర్యాల జానయ్య, మీసాల లచ్చయ్య, సత్యనారాయణ, రవి, వెంకటేశ్వర్లు, సతీష్, కార్తీక్, భిక్షం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అర్వపల్లి : తిమ్మాపురంలో పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు



నూతనకల్ : సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు 32ఏళ్ల తరువాత కలుసుకున్నారు. పాఠశాలలో 1987–92 సంవత్సరాల మధ్య 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. రోజంతా ఆడిపాడారు. అలాగే తమకు విద్యనేర్పిన గురువులు స్వరాజ్యం, భాగ్యలక్ష్మి, క్రిష్ణమూర్తి, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన సూర్యాపేట జెడ్పీటీసీ జీడి భిక్షం, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, పగిళ్ల శంకర్, రామ్మూర్తి, రామకోటి, జ్యోతుల శ్రీనివాస్, రవీందర్, చామకూరి ఎల్లయ్య, నర్సయ్య, వెంకటేష్, వీరారెడ్డి, సులోచన, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

నూతనకల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–92 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆదివారం సమ్మేళనాన్ని నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అలనాటి ఉపాధ్యాయులు కట్టా ఎల్లారెడ్డి, దండా మల్లయ్య, మస్తాన్, జాన్, జగదీష్, రామచంద్రయ్య, దామోదర్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



తిరుమలగిరిలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు

తిరుమలగిరి : తిరుమలగిరిలో ఆదివారం విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ విశ్రాంత ఉద్యోగులు కలుసుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆహ్లాదాన్ని పంచుకున్నారు. శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల కార్యదర్శి లక్ష్మీనర్సింహారావు, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమాచారి, కన్వీనర్ హమీద్‌ఖాన్, జాన్ మియా, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీలో చేరిక



మద్దిరాల : సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథాలోకి ఆహ్వానిస్తున్న కొత్తపల్లి శివకుమార్

నాగారం : డి.కొత్తపల్లిలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఆదివారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి సంపెట కాశయ్యల సమక్షంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీలో చేరారు. పార్టీలో చేరిన మాజీ వార్డు మెంబర్ దిగోజు విజయ వీరాచారి, అనంతోజు నాగరాజు, కూతటి పెద్ద లింగయ్య, పెరమళ్ల జానీ, కాత నరేష్ తదితరులకు న్యూడెమోక్రసీ నాయకులు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు యానాల సుధాకర్‌రెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, సైదులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథాలో చేరిక..

మద్దిరాల : పోలుమల్లకు చెందిన సూరారపు మల్లేష్, కవిత ఆదివారం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథాలో చేరారు. వారికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ డివిజన్ కార్యదర్శి ఎర్ర అఖిల్, కొత్తపల్లి రేణుక, పేర్ల నాగన్న, గొడ్డలి నర్సయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులు మూసి వేయాలి

తిరుమలగిరి : తిరుమలగిరి మండలంలో విచ్చలవిడిగా బెల్టు షాపులు నడుస్తున్నాయని, తక్షణమే మూసి వేయాలని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య కోరారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విచ్చలవిడిగా బెల్టు షాపులు నడవడం వల్ల యువత మద్యం సేవించి ప్రాణాలు కోల్పోతున్నారని ఆరోపించారు. బెల్టు షాపులను మూసి వేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి యాకయ్య, సోమయ్య, లక్ష్మి, శోభ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల పరీక్ష

తుంగతుర్తి : గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్ష ఆదివారం మండల కేంద్రంలో ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆయా గురుకులాల ప్రిన్సిపాల్స్ శ్యామలత, సీలారాణిలు మాట్లాడారు. గిరిజన గురుకుల పాఠశాలలో మొత్తం 384 మంది విద్యార్థులకు గాను 347 మంది, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 480 మంది విద్యార్థులకు గాను 443 మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

బంద్‌ను జయప్రదం చేయాలి

ఆత్మకూర్(ఎస్): బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై ఫిబ్రవరి 16న నిర్వహించే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచనపల్లి సైదులు కోరారు. ఆదివారం తుమ్మలపెన్‌పహాడ్, ఏపూరు, కాశీగూడెం, రామన్నగూడెం గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు జిలేరు, సుధగాని రవిగోపాల్, కొండేటి సంజీవరెడ్డి, కంచర్ల నర్సక్క, పోతురాజు ప్రతాప్, సంగం వీరయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు స్నేహితుల ఆర్థికసాయం



ఈటూరులో బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

నాగారం : ఈటూరుకు చెందిన సయ్యద్ మోసిన్ ఇటీవల మృతిచెందాడు. ఈ సందర్భంగా 2003–2004 టెన్త్ బ్యాచ్‌కు చెందిన మృతుడి స్నేహితులు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం రూ.26,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో దూదిగాని నరేష్, గోడిశాల వీరేందర్, బండి ఉపేందర్, మొగుళ్ల శోభన్, మెడబోయిన ఉపేందర్, సతీష్, కొరివి సోమన్న, పేరాల సత్యసాగర్, నాగరాజు, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అడివెంల గ్రామానికి చెందిన షేక్ కౌసర్ బేగం తండ్రి గౌస్‌మియా అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 2004–05 పదవ తరగతి బ్యాచ్ స్నేహితులు వెంటనే స్పందించారు. ఆపదలో ఉన్న తమ స్నేహితురాలు కౌసర్ బేగం కుటుంబానికి ఆదివారం రూ.13,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో తోటి విద్యార్థులు బూర్గుల భాగ్య, పాలబిందెల రేణుక, సూరారపు శ్రీను, కుంట్ల శ్రీను, పేరెల్లి గోవర్ధన్, పూర్ణచందర్, రమేష్‌నాయక్, పాలెల్లి రమేష్, చిలముల పరమేష్, శ్రీదుర్గ, అలివేలు, మొర్తల శ్రీను, పాలెల్లి స్వప్న, భిక్షం పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చదువుతోపాటు లలిత కళలో రాణించాలి

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు చదువుతో పాటు లలిత కళలో రాణించాలని పాడుతా తీయగా ఫేం టి.రాజాబాబు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాలభవన్‌ను ఆయన సందర్శించి బాలబాలికలతో ముచ్చటించారు. కార్యక్రమంలో బాలభవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణరెడ్డి, దాసరి ఎల్లయ్య, ఉమా, అనిల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్

సూర్యాపేట : బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి నిఖిల, భర్త దిలీప్‌రెడ్డిలు పార్టీకి నష్టం చేకూర్చే పనులు చేస్తున్నందున వారిని బీఆర్ఎస్ నుంచి తొలగిస్తున్నట్లు పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ ఆదివారం ప్రకటనలో తెలిపారు.

ప్రతి ఒక్కరూ వివరాలు అందించాలి

అర్వపల్లి : గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం ప్రతి ఒక్కరూ ఆధార్, ఆహార భద్రత కార్డుల వివరాలను విద్యుత్ సిబ్బందికి అందజేయాలని డిస్కం ఏఈ వాస శ్రీకాంత్ కోరారు. ఆదివారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగి వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

వైష్ణవి ఆత్మహత్యపై విచారణ జరపాలి

నూతనకల్ : గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి చిప్పలపెల్లి రవి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అర్వపల్లి : జనగామ జిల్లా కేంద్రంలోని సాన్ మారియ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన జోనల్ లెవల్ అబాకస్ పోటీల్లో జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లికి చెందిన విజ్ఞాన్ పబ్లిక్‌స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. ఈ పోటీల్లో సీనియర్ లెవెల్‌లో నోముల మధుశ్రీ ప్రథమ బహుమతి, జూనియర్ లెవల్ 1లో జెర్రిపోతుల మేఘన 2వ బహుమతి గెలుచుకున్నారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని మామిళ్లగడ్డలో నల్లమాద నాగరాజుకు చెందిన గడ్డివాము ఆదివారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునే సమయానికి గడ్డివాము పూర్తిగా దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు.

కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం

నాగారం : వర్ధమానుకోటలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సోమ జయరాములు, సోమ లక్ష్మయ్య పాల్గొన్నారు.

చివ్వెంల ఎంపీడీఓ బదిలీ

చివ్వెంల : ఎంపీడీఓ ఎల్.లక్ష్మీని బదిలీ చేస్తూ ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మూడేళ్లు పూర్తయిన అధికారులను బదిలీ చేయాలనే ఈసీ ఆదేశాల మేరకు ఆమెను నల్లగొండకు బదిలీ చేశారు.

ఆస్పత్రి ఎదుట ధర్నా

పెన్‌పహాడ్ : మండల కేంద్రానికి చెందిన చామకూరి లింగస్వామి కుమారుడు రాంచరణ్‌ను వీధి కుక్క దాడి చేసి గామపర్చింది. దీంతో అతడిని ఆదివారం చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. కానీ ఆస్పత్రిలో సిబ్బంది అందుబాటులో లేరు. దీంతో గ్రామస్తులు ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. సమాచారం తెలుసుకున్న సిబ్బంది వచ్చి చికిత్స నిర్వహించారు.